

సెలవుల్లో నేర్చుకుందాం..

పాఠశాలలకు వేసవి సెలవులు వచ్చేశాయి. విద్యార్థులు హాలీడేస్‌ను సద్వినియోగం చేసుకునే విధంగా ఇప్పటికే సమ్మర్ శిక్షణ కేంద్రాలు అందుబాటులోకి వచ్చేశాయి. 8లో▸

రేపు 'భగీరథ' జయంతి వేడుకలు

కైలాస్‌నగర్: భగీరథ మహర్షి జయంతి వేడుకలను ఈ నెల 27న ఉదయం 10గంటలకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ ప్రకటనలో తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, బీసీ కులస్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు.

గరిష్టం/కనిష్టం
37.0/23.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

'ఓపెన్' పరీక్షలు షురూ



పరీక్ష తీరును పరిశీలిస్తున్న డీఈవో ప్రణీత

ఆదిలాబాద్‌టౌన్: ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఈ పరీక్షలు కొనసాగాయి. జిల్లా వ్యాప్తంగా ఏడు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం నిర్వహించిన టెన్త్ పరీక్షలకు 640 మందికి గాను 572 మంది హాజరయ్యారు. ఇంటర్ పరీక్షలకు 364 మందికి గాను 291 మంది హాజరయ్యారు. మొదటి రోజు తెలుగు, ఉర్దూ, అరబిక్, మరాఠీ, సైకాలజీ పరీక్షలు జరిగాయి. ఆయా కేంద్రాలను డీఈవో ప్రణీత, ఓపెన్‌స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ అశోక్ పరిశీలించారు.

పుర ప్రజావాణికి 23 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ శైలజ

కైలాస్‌నగర్: పట్టణ ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రతీ మంగళవారం నిర్వహిస్తున్న పుర ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఏ.శైలజ సూచించారు. మంగళవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో బాధితుల నుంచి ఆమె అర్జీలు స్వీకరించారు. ఇంటి, నల్లా పన్నులు, అసెస్మెంట్, పేరు మార్పిడి, భూ ఆక్రమణలు వంటి సమస్యలపై 23 అర్జీలు అందాయి. ఇందులో అత్యధికంగా రెవె న్యూ సెక్షన్‌కు సంబంధించి 17, ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి ఒకటి, టౌన్ ప్లానింగ్‌కు నాలుగు, మెప్మా విభాగానికి సంబంధించి ఒకటి ఉన్నాయి. వాటిని పరిశీలించిన ఆమె సంబంధిత విభాగాల అధికారులకు అందజేస్తూ త్వరగా పరిష్కరించాల్సిందిగా ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ దివాకర్, టౌన్ ప్లానింగ్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ మహ్మద్ కలీలొద్దీన్, టీపీఓ అనురాధ, పాల్గొన్నారు.

మేడే స్ఫూర్తితో ఉద్యమిద్దాం



పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

ఎదులాపురం: మేడే స్ఫూర్తితో కార్మిక హక్కులను సాధించుకుందామని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు జగన్ సింగ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యాలయంలో మేడే పోస్టర్‌ను నాయకులతో కలిసి మంగళవారం ఆవిష్కరించారు. కార్పొరేటర్లకు కొమ్ముకాస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయన్నారు. హక్కుల సాధన కోసం కార్మికులంతా ఏకమై మేడే స్ఫూర్తితో ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నితిన్, అశోక్, కార్తీక్, జాను,సాయికుమార్, శ్యాంసుందర్, రవి, ప్రేమ్‌రాజ్ పాల్గొన్నారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

కైలాస్‌నగర్: జిల్లాలోని దివ్యాంగులకు అందించే ఉపకరణాల ఆన్‌లైన్ దరఖాస్తు గడువును మే 5వ తేదీ వరకు పొడిగించినట్లు దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ జిల్లా అధికారి కె.మిల్కా ప్రకటనలో తెలిపారు. రెట్రోఫీటెడ్ మోటర్ వెహికిల్స్, బ్యాటరీ వీల్‌చైర్, ల్యాప్‌టాప్‌లు, డైసీ ప్లేయర్లు, 4జీ స్మార్ట్ ఫోన్లు , మానసిక దివ్యాంగులకు బోధన అభ్యసన సహాయ ఉపకరణాలను ఉచితంగా అందించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల దివ్యాంగులు https:// tsomms. cgg. gov. in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సంస్కారమే జీవితంలో అలంకారం

ఆదిలాబాద్: సంస్కారమే జీవితంలో అలంకారమని గోపాలకృష్ణ మఠాధిపతి యోగానంద సరస్వతి స్వామిజీ అన్నారు. జిల్లా కేంద్రంలోని గోపాలకృష్ణ మఠంలో బాలసంస్కర్ వేసవి శిక్షణ శిబిరాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో వేసవి ప్రత్యేక శిబిరాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. నాలుగేళ్లుగా మఠంలో హిందూ ధర్మం, దేశభక్తి, ఇతర అంశాలపై శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకుంటు భావిభారత పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆర్కే సేవా సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భూమన్న, లేనిన్ తదితరులు పాల్గొన్నారు.



ఇచ్చోడ: బాదిగూడలో ఈదురుగాలులకు లేచిపోయిన ఇంటిపైకప్పు

తలమడుగు: నందిగామలో కురిసిన వడగళ్లు

వడగళ్ల బీభత్సం

- పలుచోట్ల ఎగిరిపోయిన ఇంటి పైకప్పులు
- తెగిపడ్డ విద్యుత్ తీగలు
- కరెంట్ సరఫరాకు అంతరాయం
- అంధకారంలో పలు గ్రామాలు



ఇచ్చోడ- సిరికొండ రహదారిపై విరిగిపడిన వృక్షం



వాల్గొండలో విరిగిన విద్యుత్ స్తంభం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జిల్లాలో వడగళ్ల వాన మంగళవారం బీభత్సం సృష్టించింది. పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీవర్షం పడగా, పిడుగుపాటుకు రెండు మూగజీవాలు బలయ్యాయి. ఈదురుగాలులతో కూడిన వర్షానికి పలుగ్రామాల్లో ఇంటిపై కప్పులు ఎగిరిపడగా, చాలాచోట్ల విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. దీనికి తోడు ట్రాన్స్‌ఫార్మర్లపై చెట్లు విరిగి పడటంతో అనేక గ్రామాల్లో కరెంట్ సరఫరా నిలిచిపోయింది. గాలుల తీవ్రతకు రోడ్డుకిరువైపులా ఉన్న భారీ వృక్షాలు నేలకొరగడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. చేతికొచ్చే దశలో ఉన్న మొక్కజొన్న, జొన్న, వరి పంటలు నెలకొరగడంతో అన్నదాతకు తీవ్ర నష్టం వాటిల్లింది.

చల్లబడ్డ వాతావరణం

నెల రోజులుగా భానుడు మండే ఎండలతో తీవ్ర ప్రభావం చూపగా.. ఉదయం10గంటలకే జనం బయటకు రాలేని పరిస్థితులు కనిపించాయి. తాజాగా రెండు రోజులుగా వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. మంగళవారం ఉదయం నుంచే జిల్లా వ్యాప్తంగా ఆకాశం మేఘావృతమై కనిపించింది. ఇచ్చోడ, బోథ్, తలమడుగు, తాంసి, నార్నూర్, నేరడిగొండ తదితర మండలాల్లో వడగళ్ల వాన బీభత్సం సృష్టించింది. మంచును తలపించేలా కురిసిన వడగండ్లతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. యాసంగి పంటలకు సంబసంధించి వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన కూలీలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. జిల్లా కేంద్రంతో పాటు బోథ్, బజార్‌హత్నూర్, బేల, జైనథ్, ఆదిలాబాద్ రూరల్, మావల, భీంపూర్ తదితర మండలాల్లో చిరు జల్లులతో కూడిన మోస్తారు వర్షం పడింది. ఈదురు గాలులతో కూడిన వర్షానికి ఇచ్చోడ-సిరికొండ రహదారిపై వృక్షాలు విరిగిపడి రాకపోకలకు అంతరాయం కలిగింది. ఇంద్రవెల్లి మండలం వల్గొండ, ఇచ్చోడ మండలం బాదిగుడలో ఇంటిపైకప్పులు ఎగిరిపోయాయి. పలుచోట్ల విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. కరెంటు సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

పిడుగుపాటుకు మూగజీవాలు బలి

ఓ వైపు ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడగా పిడుగుపాటుకు రెండు మూగజీవాలు బలయ్యాయి. ఇంద్రవెల్లి మండలం పాతగూడకు చెందిన సిడాం తులసీరాం ఆవు, తలమడుగు మండలం సుంకిడి గ్రామంలో అజయ్ రెడ్డికి చెందిన ఎద్దు పిడుగుపాటుకు మృతిచెందాయి. ఒక్కో దాని విలువ సుమారు రూ.30 వేల వరకు ఉంటుందని బాధిత రైతులు పేర్కొన్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

రూ.4,500 కోట్లతో అభివృద్ధి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామన్న, చిత్రంలో జెడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్, మాజీ ఎంపీ నగేశ్ తదితరులు

- కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- బీఆర్‌ఎస్ పార్టీ ప్రతినిధుల సభలో ఎమ్మెల్యే రామన్న

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ నియోజకవర్గాన్ని గడిచిన తొమ్మిదేళ్లలో రూ.4,500 కోట్లతో అభివృద్ధి చేశామని ఎమ్మెల్యే జోగురామన్న అన్నారు. పట్టణంలోని గాయత్రి గార్డెన్‌లో నియోజకవర్గ బీఆర్‌ఎస్ ప్రతినిధుల సభను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. బీజేపీ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత గ్యాస్ ధర రూ.400 ఉండగా ఇప్పుడది రూ.1200కు చేరిందని పేర్కొన్నారు. ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపినా పట్టించుకోవడం లేదన్నారు. మతతత్వ బీజేపీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, మాజీ ఎంపీ గొడం నగేశ్ మాట్లాడారు. తెలంగాణలో బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చాక అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తుందన్నారు. అనంతరం 18 తీర్మానాలను సభలో ప్రవేశపెట్టి ఆమోదించారు. కాగా సమావేశం జరుగుతున్న సమయంలో భారీ వర్షంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, గ్రంథాలయ చైర్మన్ మనోహర్, మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని, మావల జెడ్పీటీసీ నల్ల వనిత రాజేశ్వర్, బీఆర్‌ఎస్ నాయకులు యూనుస్ అక్బానీ, అజయ్, బాలూరి గోవర్ధన్ రెడ్డి, ఏవన్ రాజేశ్వర్, కిరణ్, రమేష్, ఆయా మండలాల జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, పార్టీ మండల అధ్యక్షులు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మగౌరవాన్ని నిలబెడతాం

- బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్



నృత్యం చేస్తున్న ఎమ్మెల్యే బాపూరావ్

బోథ్: తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని నిలబెడతామని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్ అన్నారు. మండలంలోని పొచ్చర క్రాస్ రోడ్డు వద్ద బీఆర్‌ఎస్ ప్లీనరీ సమావేశం మంగళవారం నిర్వహించారు. ముందుగా మండలంలోని ఆయా గ్రామాల్లో పార్టీ గ్రామాధ్యక్షులు జెండా ఆవిష్కరించారు. అనంతరం వారంతా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. సీఎం కేసీఆర్ సారథ్యంలోని తెలంగాణ రాష్ట్రం సంక్షేమ పథకాలకు అడ్డాగా మారిందన్నారు. బీఆర్‌ఎస్‌కు కార్యకర్తలే బలమన్నారు. రానున్న రోజుల్లో కేంద్రంలోనూ బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. తొమ్మిది మండలాల నుంచి పార్టీ శ్రేణులు భారీగా హాజరయ్యారు. అనంతరం కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యే నృత్యం చేశారు. కార్యక్రమంలో బోథ్ జెడ్పీటీసీ సంధ్యారాణి, మార్కెట్ కమిటీ చైర్మన్ రుక్మణ్ సింగ్, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు తాహెర్ బిన్ సలాం, నేరడిగొండ ఎంపీపీ సజన్, బోథ్ మండల కన్వీనర్ నారాయణరెడ్డి, ఆయా మండలాల కన్వీనర్లు, బీఆర్‌ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి కిరణ్‌కుమార్, మండల ప్రధాన కార్యదర్శి రాజు,నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంపీపీ శ్రీనివాస్, మాజీ ఎంపీ నగేశ్ వర్గీయుల గైర్హాజరు

ఈ సభకు బోథ్ ఎంపీపీ తుల శ్రీనివాస్, మాజీ ఎంపీ నగేశ్ వర్గీయులు హాజరుకాలేదు. నేరడిగొండ జెడ్పీటీసీ అనిల్ జాదవ్, బోథ్ పీఏసీఎస్ చైర్మన్ ప్రశాంత్, పలువురు సర్పంచులు గైర్హాజరయ్యారు.

అట్రాసిటీ కేసులు త్వరగా పరిష్కరించాలి

- కలెక్టర్ రాహుల్‌రాజ్



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్, చిత్రంలో ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి తదితరులు

కైలాస్‌నగర్: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు త్వరితగతిన పరిష్కరించి బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పురోగతిని వేగవంతం చేయాలన్నారు. బాధితులకు సకాలంలో న్యాయం చేయడంతో పాటు నిబంధనల ప్రకారం నష్టపరిహారం అందేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ ఏడాదిలో ఇప్పటిదాకా 14 కేసులు నమోదు కాగా, ఆదిలాబాద్ డివిజన్‌లో 8, ఉట్నూర్‌లో ఆరు నమోదై విచారణదశలో ఉన్నాయని తెలిపారు. ఎస్పీ డి.ఉదయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ బాధితుల ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసి విచారణ చేస్తున్నామన్నారు. పోలీస్‌శాఖ ద్వారా పూర్తి సహాయ సహకారాలు అందజేయనున్నట్లు వివరించారు. అంతకుముందు కేసుల వారీగా సంబంధించిన అంశాలను పోలీస్, రెవెన్యూ, సంక్షేమశాఖల అధికారులతో కలెక్టర్, ఎస్పీలు సమీక్షించారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు రిజ్వాన్, ఎస్.నటరాజ్, శిక్షణ సహాయ కలెక్టర్ పి.శ్రీజ, ఐటీడీఏ డీడీ దిలీప్‌కుమార్, ఆర్డీవోలు రమేశ్‌రాథోడ్, కదం సురేష్, డీఎస్పీలు ఉమేందర్, నాగేందర్, జిల్లా సంక్షేమ శాఖల అధికారులు సునీతకుమారి, రాజలింగం, కృష్ణవేణి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి పకడ్బందీ చర్యలు

కైలాస్‌నగర్: భూసంబంధిత సమస్యల పరిష్కారానికి పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో భూ సంబంధిత సమస్యలపై జిల్లాలోని తహసీల్దార్లతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. మండలాల వారీగా పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి, వాటి పరిష్కారానికి తగుచర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ భూము లు ఆక్రమణకు గురికాకుండా చర్యలు చేపట్టాలన్నారు. భూ సంబంధిత సమస్యలను ధరణి పోర్టల్‌లో మీసేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకునే విధానంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టి పరిష్కరించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఎస్.నటరాజ్, ట్రెయినీ సహాయ కలెక్టర్ పి.శ్రీజ, ఇన్‌చార్జి డీఆర్వో అరవింద్ కుమార్, ఆర్డీవోలు రమేశ్ రాథోడ్, కదం సురేష్ పాల్గొన్నారు.

మలేరియాపై అప్రమత్తంగా ఉండాలి

ఆదిలాబాద్‌టౌన్: మలేరియాపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం పురస్కరించుకుని వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఇందులో భాగంగా పట్టణంలోని కొత్త కుమ్మరివాడలో అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. సీజనల్ వ్యాధులపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతతో వ్యాధులకు దూరంగా ఉండవచ్చన్నారు. వారానికి ఒకసారి డ్రైడే పాటించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ట్రెయినీ అసిస్టెంట్ కలెక్టర్ శ్రీజ, డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, మలేరియా నివారణ అధికారి శ్రీధర్, డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన, మున్సిపల్ కమిషనర్ శైలజ, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి వైసి శ్రీని వాస్, వైద్యాధికారులు విజయసారథి, రఘునాథ్, రాజారెడ్డి, షబనాజ్, పాల్గొన్నారు.

'సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిపై ప్రభుత్వం నిర్లక్ష్యం'




వివరాలు అడిగి తెలుసుకుంటున్న సుహాసినిరెడ్డి

ఆదిలాబాద్: రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి అలంకారప్రాయంగా మారిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసినిరెడ్డి విమర్శించారు. జిల్లా కేంద్రంలోని ఆస్పత్రిని మంగళవారం ఆమె సందర్శించారు. వైద్యాధికారులు, సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు గతేడాది ఆస్పత్రిని అట్టహాసంగా ప్రారంభించినా రోగులకు ఎలాంటి ఉపయోగం లేకుండా పోయిందన్నారు. ఎంఆర్‌ఐ యంత్రం ఇప్పటివరకు అందుబాటులోకి రాలేదన్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆమె వెంట పలువురు పార్టీ నాయకులున్నారు.

నేడు కాంగ్రెస్ సమరభేరి

- జిల్లా కేంద్రంలో నిరుద్యోగ నిరసన ర్యాలీ
- టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రాక



గ్రంథాలయంలో నిరుద్యోగులను కలిసి ర్యాలీకి రావాలని కోరుతున్న డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్

సాక్షి,ఆదిలాబాద్: కాంగ్రెస్ పార్టీ జిల్లాలో సమరభేరి పూరిస్తోంది. ఆ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలో నిరుద్యోగ నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి పాల్గొననున్నారు. పట్టణంలో భారీ ర్యాలీ, అంబేద్కర్ చౌక్‌లో కార్నర్ మీటింగ్ నిర్వహించనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఏడాదిన్నర క్రితం ఇంద్రవెల్లికి దళిత గిరిజన ఆత్మగౌరవ దండోరా కార్యక్రమంలో పాల్గొనేందుకు రేవంత్ విచ్చేశారు. జిల్లాకేంద్రానికి మొదటిసారి ఆయన రానున్నారు. ఈ పర్యటన నేపథ్యంలో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం కనిపిస్తోంది.

పర్యటన ఇలా..

జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నిరుద్యోగ సమరభేరి ర్యాలీ నిర్వహిస్తున్నారు. రేవంత్ రెడ్డి సాయంత్రం 4 గంటలకు జిల్లా కేంద్రానికి చేరుకోనున్నారు. మావల వద్ద ఘన స్వాగతం పలికేలా శ్రేణులు సిద్ధమయ్యారు. కలెక్టర్ చౌక్ నుంచి ర్యాలీ ప్రారంభమవుతుంది. ఎన్టీఆర్ చౌక్, వినాయక్ చౌక్, నేతాజీ చౌక్, సినిమా రోడ్ మీదుగా అంబేద్కర్ చౌక్ వరకు సాగుతుంది. అక్కడ కార్నర్ మీటింగ్ నిర్వహించనున్నారు. ర్యాలీ, కార్నర్ మీటింగ్‌కు కలిపి సుమారు 30వేల జనం పాల్గొనేలా పార్టీ శ్రేణులు ప్రయత్నాలు చేస్తున్నాయి.

నిరుద్యోగులు తరలిరావాలి..

రాష్ట్రంలో నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై కాంగ్రెస్ సమరభేరి నిర్వహిస్తున్న దృష్ట్యా పెద్ద ఎత్తున తరలిరావాలని పార్టీ నేతలు పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షుడు సాజిద్ ఖాన్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలో పెద్ద ఎత్తున నిరుద్యోగులను కలిసి ఈ ర్యాలీకి తరలిరావాలని కోరారు. నిరుద్యోగులకు సంబంధించి 'తెలంగాణ విద్యార్థి నిరుద్యోగ జేఏసీ' కరపత్రాలను విడుదల చేశారు. కాగా ఈ పర్యటనకు సంబంధించి మాజీ మంత్రి సి.రాంచంద్రారెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు గండ్రత్ సుజాత, వెడ్మ బొజ్జు తదితరులు గతకొద్ది రోజులుగా ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. మొత్తంగా హస్తం శ్రేణుల్లో రేవంత్ పర్యటనపై ఆసక్తి నెలకొంది. దీని ద్వారా పార్టీ ఉనికిని గట్టిగా చాటాలని భావిస్తున్నారు.

క్లుప్తంగా

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



మానుకు మృతదేహం

పెంబి: నిర్మల్ జిల్లా పెంబి మండలం గెమ్మెన ఎంగ్లాపూర్ గ్రామానికి చెందిన రైతు ఆత్రం మానుకు (53) అప్పుల బాధతో మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. హెడ్‌కానిస్టేబుల్ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఆత్రం మానుకు పత్తి పంట వేశాడు. సరైన దిగుబడి రాలేదు. దీంతో రూ.3.50లక్షల అప్పు ఎలా తీర్చాలో తెలియక మనస్తాపం చెందాడు. మంగళవారం ఉదయం పంట చేనులో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లే క్రమంలో చనిపోయాడు. మృతుడి భార్య సోముబాయి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వివాహిత ఆత్మహత్య



కుమారులతో మమత(ఫైల్)

భైంసాటౌన్: వివాహిత ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని వాలేగాం గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. బంధువుల వివరాల ప్రకారం... మండలం వాలేగాం గ్రామానికి చెందిన మమత(27)కు ముధోల్ మండలం విట్టోలి గ్రామానికి చెందిన గంగాధర్‌తో కొన్నేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు. గంగాధర్ బతుకుదెరువు కోసం దుబాయ్‌కి వెళ్లగా ఆమె పిల్లలతో కలిసి భైంసాలోని పిప్రికాలనీలో నివసిస్తోంది. ఈ క్రమంలో సోమవారం అర్ధరాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. విషయం తెలుసుకున్న బంధువులు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై గణేష్ తెలిపారు.

వృద్ధుడి హఠాన్మరణం

భైంసాటౌన్: పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో వృద్ధుడు హఠాన్మరణం చెందాడు. వివరాలిలా ఉన్నాయి.. కుభీర్ మండలం చాత గ్రామానికి చెందిన బర్కుంట ఎల్లన్న (65) కాలికి గాయంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో మంగళవారం చికిత్స కోసం భైంసా ఏరియా ఆస్పత్రికి కొడుకు రవితో కలిసి రాగా సిబ్బంది గాయానికి కట్టుకట్టారు. అంతలోనే ఆయన మృతి చెందాడు. దీంతో వైద్య సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే మృతి చెందినట్లు కుటుంబీకులు ఆరోపించారు. ఈ విషయమై డాక్టర్ ప్రశాంత్‌ను వివరణ కోరగా గుండెపోటుతో మృతి చెందినట్లు పేర్కొన్నాడు.

సెలవుల్లో నేర్చుకుందాం..

• పాఠశాలలకు వేసవి సెలవులు • పలు అంశాలపై వేసవి శిక్షణ శిబిరాలు • క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ.. • శ్రద్ధగా నేర్చుకుంటే పిల్లల్లో ప్రావీణ్యత

ఆదిలాబాద్: పాఠశాలలకు వేసవి సెలవులు వచ్చేసాయి. దీంతో చిన్నారులు ఇన్ని రోజుల నుంచి బడి చదువుల్లో మునిగితేలగా వేసవి సెలవులను ఎంజాయ్ చేయడానికి ప్రణాళికలు వేసుకుంటున్నారు. విద్యార్థులు ఈ వేసవి సమయాన్ని సద్వినియోగం చేసుకునే విధంగా ప్రత్యేకంగా సమ్మర్ శిక్షణ కేంద్రాలు ప్రారంభం కానున్నాయి. క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, విలువలను పెంపొందించడానికి ప్రభుత్వ శాఖలు, పలు సంస్థల ఆధ్వర్యంలో విద్యార్థులకు శిక్షణను ఇవ్వనున్నారు. ఆ వేసవి శిక్షణ శిబిరాలను గురించి ఓసారి పరిశీలిద్దాం....

క్రీడా శిక్షణ ... భవితకు రక్షణ...



కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

పిల్లలు శారీరకంగా దృఢంగా ఉన్నప్పుడే మానసికంగా ఆరోగ్యంగా ఉంటారు. దీనిని దృష్టిలో ఉంచుకొని పాఠశాలల్లో ఆటలకు తగిన ప్రాధాన్యత ఇస్తారు. అయితే పిల్లల శారీర అభివృద్ధికి తోడ్పాటు అందించే ఆటలు క్రీడల్లో శిక్షణను అందజేయడమే లక్ష్యంగా ప్రభుత్వం వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను ప్రారంభించనుంది. ఈ శిక్షణ కేంద్రాల్లో 14 ఏళ్లలోపు బాల, బాలికలకు పలు క్రీడా అంశాలలో ఉచిత శిక్షణ అందజేయడమే కాకుండా పార్టిసిపేషన్ సర్టిఫికెట్ సైతం అందజేయనున్నారు. ఈ వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు సద్వినియోగం చేసుకుంటే భవిష్యత్తులో గొప్ప క్రీడాకారులుగా ఎదిగే అవకాశాలు లేకపోలేదు. ఈ వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు మే 1వ తేదీ నుంచి నెల రోజులపాటు కొనసాగనున్నాయి.



ఈత..

వేసవి సెలవుల్లో చిన్నారులు సెల్ ఫోన్లకు అతుక్కుపోకుండా వేసవిలో చల్లదనంతో పాటు ఆరోగ్యాన్ని అందజేస్తే ఈత శిక్షణను అందజేయడం ఉత్తమం. స్విమ్మింగ్ పిల్లలకు అద్భుతమైన శారీరక వ్యాయామాన్ని అందజేస్తుంది. ఈత కొట్టడం నేర్చుకున్న పిల్లలు ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకుంటారు.

సంస్కరించేలా.. 'బాల సంస్కార్'



రామకృష్ణ మిషన్‌లో చిన్నారులు

భారతీయ సంస్కృతి సాంప్రదాయాల పరిరక్షణకు శ్రీ రామకృష్ణ మిషన్ చేస్తున్న సేవలు అనిర్వచనీయం. బాలల్లో క్షేత్ర స్థాయి నుంచి సంస్కృతి సాంప్రదాయాలు, విలువలను పెంపొందించాలని ఉద్దేశంతో శ్రీరామకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో 'బాల సంస్కార్' అనే శిక్షణ కార్యక్రమానికి అంకురార్పణ చేసింది. ఇందులో నాల్గో తరగతి నుంచి పదో తరగతి బాల బాలికలకు శారీరక, మానసిక, నైతిక, ఆధ్యాత్మికత వంటి అంశాల్లో సర్వతో ముఖాభివృద్ధి సాధించే విధంగా పలు అంశాల్లో శిక్షణను అందజేయనున్నారు. పిల్లలకు పంచతంత్ర కథలు, నీతి శ్లోకాలు, ఆధ్యాత్మికత పెరుగుదలకు బాలల మహాభారతం, భగవద్గీత శ్లోకాలు, భజనలు, అన్నమయ్య కీర్తనలు, మానసికొల్లాసానికి యోగ, ధ్యానం, విద్యాపరమైన అభివృద్ధి కోసం వేద గణితం, చేతిరాత మెలకువలు, చిత్రలేఖనం వంటి వాటిలో ఈనెల 25వ తేదీ నుంచి శిక్షణ ప్రారంభం కాగా మే 14వ తేదీ వరకు 20 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ పొందాలనుకునేవారు సంప్రదించాల్సిన సెల్: 9490052842.



శాస్త్రీయ కళల కేంద్రం.. బాల కేంద్రం

చిన్నారులు మట్టి ముద్దల్లాంటి వారు. వారిని అందమైన, అపురూపమైన వస్తువుల తయారు చేసేవి కళలు. ప్రతి చిన్నారులను సంగీతం, నృత్యం, ఆటలపై అభిరుచి అధికంగా ఉంటుంది. చిన్నారుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని బాల కేంద్రంలో ప్రత్యేక వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా విద్యార్థులకు కూచిపూడి, భరతనాట్యం, జానపద లలిత సంగీతం, కర్ణాటక సంగీతం, తబలా, హార్మోనియం, పియానో, ధోలక్, చిత్రలేఖనం వంటి అంశాల్లో ఐదు సంవత్సరాల నుంచి 16 సంవత్సరాల లోపు విద్యార్థిని విద్యార్థులకు ఉచితంగా నేర్పిస్తున్నారు.







సద్వినియోగం చేసుకోవాలి



పిల్లల్లో క్రీడా నైపుణ్యాలు పెంపొందించాలనే ఉద్దేశంతో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేయడం జరిగింది. క్రీడా శిక్షణ శిబిరాలను ఉత్సాహవంతులైన పిల్లలు సద్వినియోగం చేసుకోవాలి. శిక్షణ శిబిరాల్లో అన్ని ఏర్పాట్లు చేస్తాం. ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటాం.

– జిల్లా యువజన క్రీడల అధికారి వెంకటేశ్వర్లు

సంస్కారవంతంగా వ్యవహరించాలనే



ప్రతి పిల్లవాడు తన శక్తి సామర్థ్యాలు తెలుసుకొని వాటి పట్ల అవగాహన కలిగి ఉండాలని లక్ష్యంతో బాల సంస్కార్ కార్యక్రమాన్ని చేపట్టాం. నేటి ఆధునిక సమాజంలో భారతీయ విలువల పరిరక్షణ అనేది ఎంతో ముఖ్యమైనది. విద్యార్థుల్లో భారతీయ సంస్కృతి సాంప్రదాయాల పట్ల గౌరవం పెంపొందుతుంది.

– లెనిన్, శ్రీ రామకృష్ణ సేవా సమితి, ఆదిలాబాద్

శరీరానికి చక్కని వ్యాయామం...



ఈత కొట్టడంతో అనేక ప్రయోజనా లున్నాయి. ముఖ్యంగా చిన్నారుల పెరుగుదలకు ఈత తోడ్పాటును అందజేస్తుంది. అదే విధంగా శరీరానికి చక్కని వ్యాయామాన్ని సైతం కలుగజేస్తుంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక బ్యాచ్ లను నిర్వహిస్తున్నాం. సద్వినియోగం చేసుకోవాలి.

– కొమ్ము కృష్ణ, ఈత శిక్షకుడు

సులభంగా నేర్చుకునేలా ప్రత్యేక శిక్షణ



శాస్త్రీయ సంగీతం, నృత్యాలను చిన్నారులు సులభంగా నేర్చుకునేలా ప్రత్యేకంగా శిక్షణ అందజేస్తున్నాం. సంస్కృతి సాంప్రదాయాలను కాపాడే శాస్త్రీయ సంగీతం, నృత్యాలు చిన్నారులు నేర్చుకోవాల్సినటువంటి ఆవశ్యకత నేటి సమాజంలో ఎంతైనా ఉంది. మరిన్ని వివరాలకు సెల్: 9703686 368

– మిట్టు రవి బాలకేంద్రం పర్యవేక్షకుడు

ఉద్యోగాల భర్తీలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం

ఎదులాపురం: ఉద్యోగాల భర్తీలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని విద్యార్థి నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ అనిల్ కుమార్ అన్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో తెలంగాణ విద్యార్థి నిరుద్యోగ జేఏసీ కరపత్రాలను మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్లు వేయక, వేసిన నోటిఫికేషన్ సక్రమంగా భర్తీ చేయక నిరుద్యోగులను ఇబ్బందులకు గురి చేస్తుందని మండిపడ్డారు. ఈ నేపథ్యంలోనే నిరుద్యోగుల హక్కుల కోసం ప్రశ్నించడానికి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఈనెల 26న జిల్లా కేంద్రానికి రానున్నారని వెల్లడించారు. ఈ నిరుద్యోగ సమరభేరికి నిరుద్యోగ యువత పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలన్నారు. డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ మాట్లాడుతూ నిరుద్యోగుల జీవితాలతో రాష్ట్ర ప్రభుత్వం చెలగాటమాడుతుందని విమర్శించారు. నాయకులు భూపెల్లి శ్రీధర్, గుడిపల్లి నగేష్, షకీల్, ఉదయ్ కుమార్ ఉన్నారు.

బాసర ఆలయ ఒడిబియ్యం హుండీ లెక్కింపు

భైంసా: బాసర శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయ ఒడిబియ్యం హుండీని మంగళవారం ఆలయ అధికారుల సమక్షంలో సిబ్బంది లెక్కించారు. ఒడిబియ్యం 36.5 క్వింటాళ్లు, ఎండు కొబ్బరి 165.5 కిలోలు, బరడి పోకలు 15 కిలోలు, పసుపు కొమ్ములు 28.5 కిలోలు, బాదం 09కిలోలు, ఖర్జూర పండ్లు 30.5 కిలోలు వచ్చినట్లు ఆలయ ఈవో విజయరామారావ్ తెలిపారు.

డైట్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డైట్ కళాశాల 2008–10 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం మంగళవారం నిర్వహించారు. 13 ఏళ్ల అనంతరం వారంతా ఒక చోటకి చేరారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆద్యంతం సందడిగా గడిపారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో డైట్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కిరణ్ కుమార్, అధ్యాపకులు వసంత్ దేశపాండే, రాజేశ్వర్ ,కిషన్ రెడ్డి,జలందర్ రెడ్డి,తుషార్ పాల్గొన్నారు.



డైట్ అధ్యాపకులతో పూర్వ విద్యార్థులు

ఆర్టీసీ బస్‌లో తప్పిపోయిన బాలుడు

భైంసాటౌన్: ఆర్టీసీ బస్ ఎక్కి తప్పిపోయిన బాలుడిని తిరిగి కుటుంబీకులకు ఆర్టీసీ అధికారులు అప్పగించారు. పట్టణానికి చెందిన అనురాధ తన కూతురు, అల్లుడిని బస్సు ఎక్కించేందుకు మూడేళ్ల మనుమడితో వచ్చింది. వారిని బస్సు ఎక్కించే క్రమంలో బాలుడు తప్పిపోయి అందబోరికి వెళ్లే బస్సు ఎక్కాడు. దీంతో తమ బాబు తప్పిపోయాడని డీఎంకు ఫోన్‌లో తెలుపగా వెంటనే స్పందించి స్టేషన్ మేనేజర్, కండక్టర్లకు సమాచారమిచ్చారు. అందబోరి బస్సులో బాబు ఉన్నట్లు గమనించిన కండక్టర్ డీఎంకు సమాచారమివ్వగా భైంసాలోని డిగ్రీ కళాశాల వద్ద బస్సు నిలిపి బాలుడిని కుటుంబీకులకు అప్పగించారు.

గాయపడిన వ్యక్తి మృతి

గుడిహత్నూర్: మండలంలోని జాతీయ రహదారి 44పై సీతాగోంది వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన సీతాగొందికి చెందిన హన్మండ్లు (45) చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం... సీతాగోంది గ్రామానికి చెందిన హన్మండ్లు వృత్తి పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. రోజులాగే దుకాణాన్ని మూసివేసి ఇంటికి వెళ్లడానికి జాతీయ రహదారిని దాటుతున్న క్రమంలో గుడిహత్నూర్ నుంచి ఆదిలాబాద్ వైపు వెళ్తున్న మోటార్ సైకిల్ ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాల పాలైన హన్మండ్లును రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. కాగా బైక్ నడుపుతున్న గోవర్ధన్ సైతం గాయాల పాలై చికిత్స పొందుతున్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపారు.

కుక్కల దాడిలో గొర్రెలు మృతి

కుభీర్: మండల కేంద్రంలో సోమవారం రాత్రి మ్యాకల నర్సప్పకు చెందిన గొర్రెలను కుక్కలు దాడిచేసి చంపేశాయి. పాకకు ఉన్న తలుపుల మధ్య నుంచి చొచ్చుకెళ్లి గొర్రెను, నాలుగు గొర్రె పిల్లలను చంపేశాయి. పలు గొర్రెలు గాయపడ్డాయి. చనిపోయిన వాటి విలువ సుమారు రూ.60వేలు ఉంటుందని, ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని బాధితుడు వేడుకుంటున్నాడు. పశువైద్యాధికారి విశ్వజిత్ పరిశీలించారు.

పిడుగుపాటుకు ఎద్దు..

తలమడుగు: పిడుగుపాటుతో మండలంలోని సుంకిడి గ్రామానికి చెందిన అజయ్‌రెడ్డికి చెందిన ఎద్దు మృత్యువాత పడింది. మంగళవారం ఉదయం పొలం వద్దకు మేత పంపించగా ఉరుములతో కూడిన వర్షం కురిచింది. వర్షానికి చెట్టు కిందకు వెళ్లిన ఎడ్లపై పిడుగు పడడంతో అక్కడికక్కడే ఒక ఎద్దు మృతిచెందింది. మరో ఎద్ద ప్రాణాలతో బయటపడింది. దాని విలువ రూ.50వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు. సంఘటనా స్థలాన్ని మండల పశువైద్యాధికారి దుద్‌రామ్ రాథోడ్ పరిశీలించారు.

విద్యుత్ షాక్‌తో గేదె..

బోథ్: మండలంలోని ధన్నూర్ గ్రామానికి చెందిన ఎద్మల హనుమంత్‌కు చెందిన గేదె ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్‌కు తగిలి మృతి చెందినట్లు బాధిత రైతు పేర్కొన్నారు. గ్రామానికి చెందిన ఓ రైతు చేనులోని సర్వీస్ వైర్‌కు తాకడంతో కరెంటు షాక్ గురై మృత్యువాత పడింది. గేదె విలువ రూ.65వేలు ఉంటుందని అన్నారు. ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని ఆయన కోరారు.

26మందికి జరిమానా

నిర్మల్‌టౌన్: మద్యం తాగి వాహనాలు నడిపిన 26మందికి జరిమానా విధిస్తూ నిర్మల్ న్యాయస్థానం తీర్పించినట్లు నిర్మల్ పట్టణ ట్రాఫిక్ ఎస్సైలు రాజశేఖర్, దేవేందర్ తెలిపారు. జిల్లా కేంద్రంలో మంగళవారం పోలీసులు వాహనాలు తనిఖీ చేపట్టారు. మద్యం మత్తులో వాహనం నడుపుతూ 26 మంది పట్టుపడగా వారికి రూ.46,100 జరిమానా విధిస్తూ స్పెషల్ జ్యుడిషియల్ జడ్జి తీర్పు ఇచ్చారు.

ప్రమాదవశాత్తు గడ్డివాము దగ్ధం

తానూరు: మండల కేంద్రానికి చెందిన బందారే రాములు పశువుల పాకలోని 25 ఎడ్లబండ్ల గడ్డివాము మంగళవారం ప్రమాదవశాత్తు దగ్ధమైంది. బాధిత రైతు వివరాల ప్రకారం.. మధ్యాహ్న సమయంలో మంటలు వ్యాపించి పశువుల పాకలో నిల్వ ఉంచిన గడ్డివాముకు మంటలు వ్యాపించాయి. గమనించిన గ్రామస్తులు పంటలను ఆర్పించే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. అగ్నిమాపక మాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. విషయం తెలుసుకున్న తహశీల్దార్ వెంకటరమణ, ఎస్సై విక్రమ్‌లు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. దీంతో 80వేల ఆస్తినష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయాడు.



కాలిపోతున్న గడ్డివాము

పర్యావరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలి

ఎదులాపురం: ఆదివాసీలను అడవికి దూరం చేసేలా ఉన్న నూతన పర్యావరణ పరిరక్షణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని, ఉట్నూర్ ఐటీడీఏకి రెగ్యులర్ పీవోను నియమించాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారు రవికుమార్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సంఘం జిల్లా రెండవ మహాసభలో ఆయన మాట్లాడారు. ఉట్నూర్ కేంద్రంగా గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేసి గిరిజన విద్యారంగ అభివృద్ధికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. ముందుగా జిల్లా అధ్యక్షుడు ఆత్ర క్రిష్టన్న సంఘం జెండా ఆవిష్కరించారు. సంఘంలో పని చేస్తూ అమరులైన వీరులకు నివాళులర్పించారు.



మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవికుమార్

జిల్లా కమిటీ ఎన్నిక

అనంతరం 25మందితో జిల్లా కమిటీ ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఉయిక విష్ణు, ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ (రెండవ సారి) ఎన్నికయ్యారు. సంఘం నేతలు ఆత్రం కిష్టన్న, బైరి సోమేష్, ఆత్రం తనుష్, లంకా రాఘవులు, ఆడె అర్జున్, పూసం గణేష్, దుర్వ రాంచందర్, రాజు, సురేష్ ఉన్నారు.


పిడుగుపాటుకు యువకుడి మృతి



మోహన్(ఫైల్)

ఖానాపూర్: పిడుగుపాటుతో యువకుడు మృతిచెందిన సంఘటన మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం... మండలంలోని రాజూరా గ్రామానికి చెందిన పాతకుంట మోహన్(21) ఎప్పటిలాగే మేకలు కాసేందుకు గ్రామంలోని అటవీ ప్రాంతానికి వెళ్లాడు. ఈ క్రమంలో వర్షం కురియడంతో మామిడిచెట్ల కిందకి వెళ్లాడు. చెట్టుపై పిడుగుపడడంతో మోహన్ అక్కడికక్కడే మృతి చెందాడు.

ఫైరింగ్‌లో డిగ్రీ విద్యార్థి ప్రతిభ



సైని సాకేత్

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన సైని సాకేత్ ఎన్‌సీసీ విద్యార్థి తెలంగాణ బెటాలియన్ ఉమ్మడి ఆదిలాబాద్ పరిధిలో శనివారం నిర్వహించిన ఫైరింగ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానం సాధించినట్లు ప్రిన్సిపాల్ భీమరావు తెలిపారు. దీంతో రాష్ట్రస్థాయి ఫైరింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. సాకేత్‌ను ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ జె.భీమరావు, సిబ్బంది అభినందించారు.